# తమరే ఇటుల చేయతగునా

**కె. తాయారమ్మ**

ఉదయం ఏడుగంటలవుతోంది. ముఖానికి పేపరు అడ్డం పెట్టుకుని వీధివసారాలో ఫోమ్ కుర్చీలో కూచున్నాడు కోనంగిరావు. అతనికి తలనొప్పిగా వుంది. ఇంకా కాఫీ పడలేదు. పేపరు వార్తల మీద మనస్సు లగ్నం కావడంలేదు!

వంటింట్లోంచి చిత్రమైన ధ్వనులు వినవస్తున్నాయి. అనంతలక్ష్మి లోపల ఏదో చేస్తున్నట్లుంది. కాఫీ వస్తున్న ఛాయలు కనిపించడంలేదు!

వంటింటివైపు చూశాడు. ఫ్చ్! తలుపు బంద్‌చేసి వుంది. ఇదివరలో అయితే అనంతలక్ష్మి చేసే ప్రతి పనీ తనకి స్పష్టంగా కనిపిస్తూవుండేది!

కాని... కాని... ఇప్పుడవిలేవు! తన ముఖమే నచ్చనట్లు తలుపులు మూసుకుని మరీ పనిచేసుకుంటోంది అనంతలక్ష్మి.

తనకి ఒక్క క్షణం కాఫీ అందడం లేటయితే "ఇదిగో అనూ! అనంతూ, అనంతలచ్చీ, ఒట్టి లచ్చీ కాఫీ ఏది?" అంటూ కేకలు పెట్టేవాడు.

ఇప్పుడు అరిచి గీపెట్టినా కాఫీ రాదు సరికదా తననో దోషిగా చూస్తోంది అనంతలక్ష్మి.

దూరంగా పుస్తకాలు ముందేసుకు కూచున్న కొడుకు నాగార్జున కనిపించాడు. అనంతలక్ష్మి నాగార్జున అభిమాని! అందుకే కొడుక్కి ఆ పేరు పెట్టుకుంది! వాడికి ఏడేళ్ళు!

"నాగా! అమ్మని కాఫీ అడిగితేరా! తల బద్దలయిపోతోంది!" అన్నాడు.

వాడోసారి ఇటువైపు చూసి "కుదర్దు!" అన్నాడు.

"ఏం ఎందుకని?"

"కూచున్న చోటునించి కదలద్దంది మమ్మీ!"

వాడు తల్లి పార్టీ. 'నీ దృష్టిలో కూడా నేను చులకనయిపోయానురా నాగా!' అనుకుంటూ లేచి వీధిగుమ్మంలో నిలుచున్నాడు కోనంగిరావు.

నాగ ఏవో ఇంగ్లీషు లైన్స్ బైహార్ట్ చేస్తున్నాడు.

"నాగా నా బుజ్జి కదూ! ఒక్కసారి లోపలికెళ్ళి కాఫీ తేవూ!"

ఒక్కసారి లేచి నిలుచుని గట్టిగా అరిచాడు.

"తేనుగాక తేను! నేను చదువుకుంటున్నాను! చదవకపోతే చదవలేదంటారు! చదువుతూంటే పదిసార్లు పిలుస్తారు! అన్నీ మీ పెద్దవాళ్ళే అంటారు! ఎట్లా చచ్చేది? నిర్భుంగా నాకు చచ్చిపోవాలనుంది!"

అచ్చు బాపుగారి కార్టూన్లా అనిపించాడు వాడు.

మరోసారి లోపలికి తొంగిచూశాడు కోనంగిరావు. స్మిత కూడా ఎక్కడా కనుపించలేదు!

"స్మితా!" పిలిచాడు.

"నన్ను పిలవొద్దు డాడీ! బొమ్మలు గీసుకుంటున్నాను! ఇంకా వాటికి రంగులు వెయ్యాలి!" డాబా మెట్లకిందనించే సమాధానం చెప్పింది స్మిత.

స్మిత కూడా తల్లి పక్షమే! 'ఎంత చక్కగా దిద్దావు అనంతూ పిల్లల్ని! నాకు బద్ధశత్రువుల్లా తయారు చేశావు వాళ్ళని!' అనుకున్నాడు ఉక్రోషంగా.

స్మిత పేరు స్మితాపాటిల్! తన అభిమాన హీరోయిన్ పేరు పెట్టుకుంది అనంతలక్ష్మి తన కూతురికి.

ఆవేళ ఆదివారం.

మరొకప్పుడయితే నేతి పెసరట్ల వాసనలు, సేమ్యా ఉప్మాల ఘుమఘుమలు, పూరీ, వడ, దోశలతో ఎంతో ఆనందంగా గడిచేది ఆదివారం.

కాని... ఇప్పుడు...?

నిశ్శబ్ద యుద్ధం జరుగుతోంది ఇంట్లో.

ఇప్పుడా మధురిమలు ఏవి...?

మెల్లగా వీధిలోకి నడిచాడు కోనంగిరావు. ఎదురింటి కొండిగాడు అదోలా చూశాడు తనవైపు. తన ఇంటి వాతావరణం కనిపెట్టినట్టున్నాడు వాడు... తనవైపు ఎకసక్కెంగా చూస్తున్నాడు. వీడికి కొండిగాడు అని కాకుండా తేలుకొండిగాడు అని పేరుపెట్టి వుండాల్సింది! ఊరి భోగట్టాలన్నీ వీడికే!

ఒకసారి వాడివైపు చురచుర చూసి రఫీ టీకొట్టు వైపుగా సాగిపోయాడు కోనంగిరావు.

"ఓ స్ట్రాంగ్ టీ కొట్టు!" అన్నాడు అక్కడున్న బెంచిమీద కూచుంటూ.

"అమ్మగారు ఊళ్ళో లేరా సార్?" అన్నాడు రఫీ టీ కలుపుతూ. టీ స్టాల్‌కి వచ్చిన అందరి యోగక్షేమాలు అడుగుతూ వుంటాడు రఫీ. కోనంగిరావంటే ప్రత్యేకమైన అభిమానం రఫీకి.

సమాధానం చెప్పకుండా టీ గ్లాసు అందుకున్నాడు కోనంగిరావు. గ్రహించినవాడిలా ఊరుకున్నాడు రఫీ. 'ఆ తేలుకొండిగాడి కంటే ఇతగాడే నయం!' అనుకున్నాడు కోనంగిరావు రఫీ చేతికి డబ్బులిచ్చి వెనుదిరిగి వెళ్ళిపోతూ.

అలాగే నిలబడి వున్నాడు తేలుకొండిగాడు ఎదురింటి గుమ్మంలో.

మళ్ళీ వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

ఇంట్లో ఎలాంటి మార్పూ



లేదు!

అసలు అనంతలక్ష్మి ఇంట్లో వంట చేస్తోందో లేదో?

ఈ కోల్డ్‌వార్ ఏమిటో? అనంతలక్ష్మి పట్టుదల గల మనిషి. పంతం పట్టిందంటే ఒకింత మారదు. భగవాన్ ఏమిటీ పరీక్ష?

మళ్ళీ తలపోటు ప్రారంభమైంది. అది కాఫీ తాగితే కాని తగ్గదు! కాని కాఫీ వచ్చే సూచనలు కానరావడంలేదు! 'అనంతూ! ఎంత గట్టి శిక్ష వేశావు? నన్ను నాలుగు తిట్టి నా తప్పు నాకు చెప్పి వుంటే సంతోషించేవాణ్ణి! ఇలా మౌనంగా సాధించ డం ఏంబాగుంది చెప్పు?' జుట్టు గట్టిగా పీక్కున్నాడు కోనంగిరావు! ఇదివరలో అయితే పెద్ద ఉంగరాల జుత్తు వుండేది! పీక్కుందుకి బాగుండేది! కానీ ఇప్పు డు జుట్టు బాగా రాలి, పీక్కుంటే నొప్పిపుడుతోంది!

తలపోటు క్షణక్షణానికీ పెరిగిపోతోంది. పోనీ మళ్ళీ రఫీ కొట్టుకి వెళ్దామంటే అక్కడ కాఫీ ఉం డదు! 'నాగా! అమ్మని కాఫీ అడుగు'. వాడు ఇటువైపు చూడలేదు! వాడికి తల్లి పట్టుదల బాగా వచ్చింది.

వంటింటి తలుపు చప్పుడయ్యింది! ఆత్రుతగా అటువైపు చూశాడు. అనంతలక్ష్మి మెల్లిగా ఇవతల కొచ్చి పిల్లలిద్దరికీ గ్లాసులతో పాలు అందించి మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది. తనకి కాఫీ తెస్తుందను కున్నాడు. కానీ తేలేదు. మరీ ఇంత కఠినమైన శిక్షా? ఆదివారం పూట తనకి ఉదయం నాలుగైదు సార్లు కాఫీ తాగటం అలవాటు. కాని ఒక్కసారి కూడా లేకపోతే ఎలా?

మెల్లగా లోపలికి నడిచి అల్మారాలో వున్న ఫ్లాస్కు తీసుకుని వీధిలోకి నడిచి బండి స్టార్ట్ చేశాడు! ఈ ప్రారబ్ధం ఏమిటో?

ఓ పెద్ద హొటల్ ముందు బండి ఆపి టిఫిన్, కాఫీ సేవించి, ఫ్లాస్క్‌లో నాలుగు కప్పులు కాఫీ పోయించుకుని ఇంటికి బయలుదేరాడు. వచ్చేసరికి తేలుకొండిగాడు ఇంకా అలాగే నిలబడ్డాడు పళ్ళికి




*హైదరాబాద్ ఆంధ్ర సారస్వత పరిషత్‌లో శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో డా॥ బొద్దుల వెంకటేశం రచించిన 'సాహిత్య విజ్ఞానం', 'ఆనందవర్ధనుని సాహిత్య దర్శనం', 'తెలుగు ఆలోచనా ఆరంభ్ అవుర్ వికాస్' గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య కె. యాదగిరి, ఆచార్య టి. మోహన్‌సింగ్, డా॥ కె. బాపురెడ్డి. చిత్రంలో ఆచార్య ఎస్వీ రామారావు, మసన చెన్నప్ప, వెలుదండ నిత్యానందరావు, గ్రంథకర్త రఘుశ్రీ, డా॥ లలితావాణిలు ఉన్నారు.*

లిస్తూ. వాడికి పక్కవాళ్ళ సంగతులు మీద ఇంట్రస్టు ఎక్కువ.

లోపలికి నడిచి మళ్ళీ పేపరు ముఖానికి అడ్డు పెట్టుకు కూచున్నాడు. కాఫీతో వచ్చిన నిశ్చింత అతన్ని హాయిగా కూచునేలా చేసింది.

అనంతలక్ష్మి తిట్ల దండకంతో గిన్నెలు బరబరా తోముతోంది. అదన్నమాట అసలు సంగతి. పని మనిషి రాలేదన్న సంగతి అర్ధమయింది.

నా అదృష్టం ఇలా మండుతూ వుంటే సుఖాలెలా వస్తాయి నాకు? ఓ అచ్చటా? ముచ్చటా? ఎక్కడికైనా వెళ్ళాలా? ఏడవాలా? మామయ్య నన్ను ఎంత అభి మానంగా చూశాడని? కన్నకూతురిలా చూశాడు! అలాంటి మామయ్య మాటలెక్కచెయ్యకపోతే ఇంక తను ఏం చెయ్యగలుగుతుంది? 'రావే కూతురా! అంటే కోతిమొగుడే అమ్మా!' అంది వెనుకటి కొక ఇల్లాలు...

"అదన్నమాట అసలు సంగతి! అనుకున్నాడు కోనంగిరావు. తన పొరపాటేమిటో తెలిసివచ్చింది! అయినా తనూ పట్టు విడువడు. భార్య ప్రతిపాదన ఏమీ సబబుగా లేదు. దాన్ని ప్రోత్సహించి పాటించ వలసిన అవసరం తనకి లేదు.

అనంతలక్ష్మి పట్టుదల సంగతి తనకి తెలిసిన దైనా ఇన్నాళ్ళు స్ట్రయిక్ చేస్తుందని తను ఊహించ లేదు.

పదిహేను రోజులైంది స్ట్రయిక్ మొదలెట్టి. పిల్లలు కూడా తల్లి అడుగుజాడల్లో నడుస్తున్నారు.

ఇల్లంతా ఏదోలా ఉంది! నిన్నటివరకు గ్లాసుతో కాఫీ తెచ్చి ఠక్కున శబ్దం చేస్తూ బల్లమీద పెట్టి వెళ్ళిపోయేది! ఇవాళ అది కూడా లేదు. ఇవాళ స్ట్రయిక్ బలంగా వుంది.

అనంతలక్ష్మిని ఏరి కోరి తెచ్చి అంటగట్టింది బామ్మ. ఆవిడ చిన్నప్పుడు అడివి బాపిరాజుగారి నవలలు చదివేదట. అందులో 'కోనంగి' నవల ఆవి డకి నచ్చిందట. అందుచేత నాన్నతో కోనంగిరావు అని పేరు పెట్టించిందిట. తనని అందరూ కోనంగీ అని పిలుస్తూ వుంటే ఎంతో సిగ్గుగా వుండేది.

ఇంకో విచిత్రం. కోనంగి నవలలో కోనంగిరావు భార్య పేరు అనంతలక్ష్మిట. అనుకోకుండా తనకి వచ్చిన సంబంధం తాలూకు పిల్ల పేరు కూడా అనంతలక్ష్మి కావడంతో, బామ్మ సంతోషంతో ఉక్కిరి బిక్కిరై 'ఒరే కోనంగీ! నిజంగా నువ్వు అదృష్టవంతుడి విరా!' అంటూ బుగ్గలు పుణికిపుచ్చుకుని అనంత లక్ష్మిని కట్టబెట్టింది.

అనంతలక్ష్మి బొద్దుగా వుంటుంది! అయినా సర్దుకున్నాడు. అప్పుడే తాతయ్య జోక్ చేసాడు. 'ఒరే కోనంగీ, నవలలో కోనంగిరావుకి ఓ ప్రియు రాలు కూడా వున్నట్లుందిరా! పేరు సీతామహాలక్ష్మి! అనుకుంటాను' అంటూ.

"చాల్లెండి సంబడం... వాడికి అలాంటివి నూరి పోస్తారా?" అంటూ బామ్మ తాతయ్యని నిలువరిం చింది.

'బామ్మా! నీ సాహితీ పిపాస మండిపోనూ! నీ నవలా పఠనం తగలెయ్యా! నన్ను నిలువునా ముం చావుకదే!' అంటూ రోజుకొకసారైనా తిట్టుకుంటూ వుంటాడు కోనంగిరావు.

మరో నాలుగు రోజులు గడిచాయి. ఇంకా సమ్మె విరమణ జరగలేదు. అనంతలక్ష్మి తనకి భోజనం టేబిల్‌మీద పడేసి వీధిలోకి వెళ్ళి కూచుంటోంది! రాత్రి పిల్లలిద్దర్నీ తనకి చెరోవైపు వేసుకుని హాల్లో చాపలు పరిచి పడుకుంటోంది!

పోనీ ఆమె కోరిక తీర్చేద్దామంటే దానికి కాల దోషం పట్టింది. ఇంక తనేమీ చెయ్యలేదు. ఒకటి రెండుసార్లు భార్య ఒంటిమీద చెయ్యివేసి "అనంతూ! నన్ను క్షమించు!" అంటే తనని తోసిపారేసింది!

"పోనీ మీ మామయ్య ఇంటికి ఓసారి వెళ్ళిరా!" అన్నాడు.

"ఇప్పుడెందుకుట?" అంటూ భద్రకాళి అవతా రం ఎత్తింది.

"పోనీ మా బామ్మనీ, తాతయ్యనీ చూసి ఆ పల్లెటూర్లో నాలుగురోజులు వుండివద్దాం!" అంటే నిప్పులు చెరుగుతూ చూసింది.

ఇంకా ఆమె ఇష్టాలేమిటి? ఆలోచిస్తూ రోడ్డుమీద

నడుస్తున్నాడు. ఓ వాల్‌పోస్టర్ ఆకర్షించింది అతన్ని. మరికొంచెం దూరం నడిచాడు. పెద్ద కటౌట్, బేనరు! 'దీనితో అనంతలక్ష్మిని ప్రసన్నం చేసుకోవచ్చు' అనుకుంటూ అటు నడిచాడు.

అతికష్టమ్మీద నాలుగు టిక్కెట్లు సంపాదించాడు.

అది శ్రీరామదాసు సినిమా!

అనంతలక్ష్మి నాగార్జున అభిమాని. ఇవాళ ఎలాగైనా ఆమెని, పిల్లల్ని తీసుకుని సినిమాకెళ్ళాలి! అనుకుంటూ నడిచాడు.

ఆఫీసుకి సెలవు పెట్టాడు.

ఎప్పుడెప్పుడు సాయంత్రం అవుతుందా? అని ఎదురుచూడసాగాడు. అనంతలక్ష్మిని ఆశ్చర్యంతో ముంచెత్తేయాలి! అనుకున్నాడు కోనంగిరావు.

సాయంత్రం ఐదు గంటలవుతుండగా "అనంతూ! నువ్వూ పిల్లలూ తయారవ్వండి! నీ అభిమాన హీరో సినిమా రిలీజయ్యింది! సినిమా చూసి అటు నించటే హొటల్లో భోజనం చేసి వద్దాం!" అంటూ కన్విన్స్ చేయబోయాడు!

"మీతో మేం రాము! మీరెళ్ళండి!" అంటూ రిమోట్ పట్టుకుని టి.వి. కెదురుగా సెటిలయ్యింది. పిల్లలు ఇటువైపు కూడా చూడలేదు. స్కూల్‌బ్యాగ్‌లు పడేసి ప్రైవేట్‌కి సిద్ధంకాసాగారు.

తనొక్కడే బయలుదేరాడు. తేలుకొండిగాడికి విషయం అర్థమయినట్లుంది. కిసుక్కున నవ్వాడు.

వాడివైపు కొరకొర చూసి హాలు వైపు నడిచాడు.

*　　*　　*

అనంతలక్ష్మి హాల్లో కూర్చుని ఆలోచిస్తోంది. పిల్లలు ఇంటిదగ్గర లేకపోవడంతో టి.వి. మ్రోగడం లేదు. దరిదాపు నెలరోజులుగా భర్తతో మాటలు లేవు. తను కోరిన కనీసపు కోరిక కూడా తీర్చలేని భర్త ఎందుకు? అనిపించి అతనితో మాటలు మానివేసింది. ఇంట్లో ఇద్దరూ బద్ధశత్రువుల్లా ప్రవర్తిస్తున్నారు.

కొన్నిరోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది ఆమెకి. చిన్నప్పటినించీ తనని పెంచి పెద్ద చేసిన మామయ్య దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"అనంతూ! నా కూతురి పిన్నత్తగారి ఆడపడుచు మనవడికి నా ఇంట్లోనే పెళ్ళి చేస్తున్నారు. ఆడపెళ్ళివారిది వెస్ట్ బెంగాల్. మన భాష, పద్ధతులూ ఏమీ తెలియవు. అందుచేత మేమే బయలుదేరి వస్తాం. మీ మగపెళ్ళి వారింట్లోనే పెళ్ళి జరిపించండి. అంటూ అభ్యర్థించారు. ఈ భారం నానెత్తిన వేసుకున్నాను. నువ్వెలాగైనా ఓ నాలుగు రోజులు ముందు వచ్చి పెళ్ళయిన తరువాత మరో నాలుగురోజులుండి మాకు సహాయం చేసి వెళ్ళు. నీ పెళ్ళి, పేరంటం చేసినవాణ్ణి, పెద్దవాణ్ణి. నిన్ను వేడుకుంటున్నాను... నా మాట మన్నించి వస్తావని ఆశిస్తున్నాను. పైగా నీకు హిందీ కూడా వచ్చు. ఎలాగైనా మెయిన్‌టైన్ చెయ్యవచ్చు. నీ వదిన పరువు దక్కించు" అంటూ.

తను హిందీ పరీక్షలన్నీ పాసయ్యింది. కొంచెం బెంగాలీ కూడా వచ్చు.

వెళ్తానని భర్తని అడిగింది. నువ్విప్పుడెళ్ళిపోతే ఎలాగ అనంతూ? నాకు ఆఫీసు ఇన్‌స్పెక్షన్ వుంది. పిల్లలకి పరీక్షలు... అంటూ కొట్టిపారేశాడు. ఎంత బ్రతిమాలినా ప్రయోజనం లేకపోయింది. దాంతో తన అహం దెబ్బతిని అతనితో మాట్లాడడం మానేసింది. పిల్లలు ఆమెనే అనుసరిస్తున్నారు.

ఇలా ఆలోచిస్తున్న అనంతలక్ష్మి "చెల్లెమ్మా, శ్రీరామదాసు సినిమాహాలు దగ్గర కోనంగిరావుగార్ని పోలీసులు కొడుతున్నారు" అన్న మాట చెవిని పడగానే వీధిలోకి పరుగెత్తింది.

అనంతలక్ష్మి హాలు సమీపించేసరికి పోలీసులతో ఘర్షణ పడుతున్నాడు కోనంగిరావు.

"ఏరా రాస్కెల్ ఎన్నాళ్ళబట్టి చేస్తున్నావురా ఈ పని?" అంటూ లాఠీతో మండలమీద కొడుతున్నారు పోలీసులు.

"ఆయన్ని కొట్టకండి! ఆయన అలాంటివారు కాదు!" అంటూ పరుగున వెళ్ళి పోలీసుల్ని వారించింది అనంతలక్ష్మి.

"అందరూ అలాగే చెప్తారు! ముందు మీరు అడ్డు

లేవండి!" అంటూ మళ్ళీ లాఠీ ఎత్తారు పోలీసులు.

"మీ చెల్లెలిలాంటిదాన్ని! మళ్ళీ అలా జరక్కుండా చూసుకుంటాను!" అంటూ ప్రాధేయపడింది అనంత లక్ష్మి.

"సరే!" అంటూ విడిచిపెట్టారు పోలీసులు.

దోషిలా భార్యవెంట ఇంటికి నడిచాడు కోనంగి రావు.

* * *

ఆ రాత్రి! "అనంతూ! నామీద కోపం పోయిం దా?" భార్య ఒంటిమీద చెయ్యివేస్తూ ప్రశ్నించాడు కోనంగిరావు.

"పాపిష్టిదాన్ని ఇన్నాళ్ళూ మిమ్మల్ని బాధపెట్టాను! ఇంక హాయిగా నిద్రపోండి!" అని మళ్ళీ అంది, "అమ్మో ఇవాళ ఎంత గండం గడిచింది! నిజానికి ఆ కొండలరావు అన్నయ్యగారే కనుక చెప్పివుండక పోతే ఎంత ఘోరం జరిగివుండేదో?" అంటూ వెను దిరిగింది అనంతలక్ష్మి "తమరే ఇటుల చేయతగునా" అనుకుంటూ.

"ఒరే తేలుకొండిగా ఇది నీ నిర్వాకమా?" సి.ఐ. డి. ఉద్యోగం కూడా వెలగపెడుతున్నావురా? అను కుంటూ అలా ఫ్యాన్‌వైపు చూస్తూ పడుకున్నాడు.

అసలేం జరిగింది?

ఆ రోజు సాయంత్రం శ్రీరామదాసు టిక్కట్లు పట్టుకుని సినిమాకెళ్ళాడు. అనంతలక్ష్మి, పిల్లలు లేకుండా సినిమా చూడాలనిపించలేదు!

ఏడుపు ముంచుకొచ్చింది కోనంగిరావుకి.

అందరూ హాయిగా భార్యాపిల్లలతో సినిమాకెళ్తు న్నారు. తనకా అదృష్టం లేకపోయింది. అక్కడ ఒక పోకచెట్టు కింద సిమెంటు బెంచీమీద కూచున్నాడు చేత్తో టిక్కెట్లు పట్టుకుని.

ఇంతలో భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఇటువైపుగా వస్తున్నారు. వాళ్ళకి టిక్కెట్లు దొరికినట్లు లేదు! "సినిమా చూద్దాం ఇంటికెళ్ళొద్దు' అంటూ ఏడుస్తు న్నారు పిల్లలు.

**నీకు జ్ఞాపకం ఉందోలేదోనని...**



జ్ఞాపకశక్తి పెంచుకోవ డం ఎలా? అనే పుస్తకం ఉందా? అడిగాడు శంకరం పుస్తకాల షాపుకెళ్ళి.

ఉంది సార్... చెప్పాడు షాపులో కుర్రాడు.

డబ్బులిచ్చి ఆ పుస్తకం తీసుకెళ్తున్న శంకరాన్ని అడిగాడు షాపులో కుర్రాడు – 'ఎందుకు సార్! చదవనిదానికి ఆ పుస్తకం కొనడం?'

నేను పుస్తకం చదవనని ఎందుకనుకుంటు న్నావ్? కోపంగా ప్రశ్నించాడు శంకరం.

మీరు ఇదే పుస్తకాన్ని గతంలో నాలుగు సార్లు కొన్నారు మరి... తాపీగా చెప్పాడు ఆ కుర్రాడు.

తనకెలాగూ పనికిరావు... వాళ్ళకిస్తే సరిపో తుంది. అనుకుంటూ "ఇందండి టిక్కెట్లు! మా ఫ్రెండ్స్ వస్తామని రాలేదు!" అంటూ వాళ్ల చేతిలో టిక్కెట్లు వుంచాడు కోనంగిరావు.

వాళ్ళు కృతజ్ఞతగా చూశారు.

పిల్లల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

అతను జేబులోంచి కొన్ని నోట్లు తీసి కోనంగి రావు చేతిలో పెట్టాడు. అంతే... కోనంగిరావు చేతి మీద లాఠీదెబ్బ పడింది. 'దొంగ రాస్కెల్ ఎంత సంపాదించావురా ఇవాళ?' అంటూ జేబులో వున్న వెయ్యిరూపాయలు కూడా లాక్కున్నారు వాళ్లు.

అంతవరకూ 'యాభైరూపాయల టిక్కెట్టు ఐదు వందలు' 'వెయ్యి రూపాయలు' అంటూ ప్రతిమనిషి దగ్గరకీ తిరుగుతూ బ్లాకులో టిక్కెట్లు అమ్ముతున్న వాళ్ళంతా పోలీసుల్ని చూడగానే తలోవైపూ పారిపో యారు.

తను మరునాడు ఆఫీసులో తన మొహం ఎలా చూపించగలడు?

'పూర్ ఫెలోవిరా కోనంగీ!' అనుకుని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు కోనంగిరావు. ●